క్లుప్తంగా

నేటి 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాలు

తెనాలిఅర్బన్: తెనాలి పట్టణ పరిధిలోని 11, 39 వార్డుల్లో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.జశ్వంతరావు ఒక ప్రకటనలో తెలిపారు. 11వ వార్డు రామలింగేశ్వరపేట సచివాలయం వద్ద ఉదయం 11 గంటలకు, 39వ వార్డు ఐతానగర్-1 సచివాలయాల వద్ద మధ్యాహ్నం 3గంటలకు సభలు నిర్వహించనున్నట్లు చెప్పారు. అలాగే సచివాలయాల్లో సంక్షేమ పథకాల లబ్ధిదారుల వివరాలు తెలియజేసే బోర్డులను ఆవిష్కరించనున్నట్లు వివరించారు. కౌన్సిలర్లు, అధికారులు పాల్గొనాలని కోరారు.

ప్రతి ఒక్కరూ ఇంధన పొదుపు పాటించాలి



నగరంపాలెం: భావితరాలకు సహజ వనరులు అందించాలంటే ఇంధన పొదుపు పాటించాలని విద్యుత్ శాఖ టౌన్-1 డివిజన్ ఈఈ శ్రీనివాసబాబు అన్నారు. జాతీయ ఇంధన పరిరక్షణ వారోత్సవాలలో భాగంగా ప్రభుత్వ మహిళా కళాశాలలో మంగళవారం విద్యార్థులకు వ్యాసరచన, జనరల్ నాలెడ్జ్ ఇతరత్రా అంశాలపై పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు జ్ఞాపికలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ విద్యుత్ విలువైనదని వృథా కాకుండా కాపాడుకుందామని చెప్పారు. విద్యుత్ పొదుపుతో ఇంధనం ఆదా అవుతుందని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ జ్యోత్స్నకుమారి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే విద్యుత్ పొదుపు ఆచరించాలని అన్నారు. కార్యక్రమంలో టౌన్-4 డీఈఈ పీహెచ్ ఖాన్, సీఆర్‌డీఏ కన్‌స్ట్రక్షన్ డీఈఈ జి.సురేష్‌బాబు, డీ-3 ఏఈ చంద్రశేఖర్ పాల్గొన్నారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు.

హనుమాన్ చిత్రం ట్రైలర్ ఆవిష్కరణ

పాత గుంటూరు: జనవరి 12న విడుదల కానున్న హనుమాన్ చిత్రం ప్రమోషన్‌లో భాగంగా మంగళవారం సినిమా ట్రైలర్‌ను కొత్తపేటలోని భాస్కర్ థియేటర్‌లో ఆవిష్కరించారు. యూవీ ప్రొడక్షన్ డిస్ట్రిబ్యూటర్ శంకర్ మాట్లాడుతూ ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో ఇంద్ర సినిమాలో బాల నటుడిగా నటించిన తేజ సజ్జ హీరోగా నటించిన సినిమాను కుటుంబసమేతంగా చూడాలని ప్రేక్షకులను కోరారు.

విశ్వ బ్రాహ్మణుల అభివృద్ధి, అభ్యున్నతికి కృషి

నెహ్రూనగర్: విశ్వ బ్రాహ్మణుల అభివృద్ధి, అభ్యున్నతికి అందరూ కలిసి కట్టుగా పని చేయాలని విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పావులూరి హనుమంతరావు పిలుపునిచ్చారు. విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో కార్తీక మాస వన సమారాధన గుంటూరు అరండల్ పేటలోని విశ్వబ్రాహ్మణ కల్యాణమండపంలో మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో గుంటూరు మహానగర వన సమారాధన కమిటీ సభ్యులు గట్టి శ్రీనివాసు, పదిర ఈశ్వరచారి, భరద్వాజ, భద్రయ్య, శివరామబ్రహ్మం, కొటేశ్వరరావు పాల్గొన్నారు.

వెండి ఆభరణాల బహూకరణ



పాత గుంటూరు: మండల పరిధిలోని లాల్‌పురం బాల మురళీకృష్ణ మందిరానికి తాళ్లపనేని సత్యనారాయణ, వెంకాయమ్మ దంపతులు వెండి ఆభరణాలు బహూకరించారు. జీడీసీసీ చైర్మన్ రాతంశెట్టి సీతారాంజనేయులు సూచన మేరకు 1.5 కిలోల వెండి శతగోపురం, హారతిపళ్లెం అందజేశారు. కార్యక్రమంలో ఎ.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

యోగాసన పోటీల్లో విజ్ఞాన్ విద్యార్థుల ప్రతిభ

చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీకు చెందిన ఆరుగురు విద్యార్థులు జాతీయ స్థాయి యోగాసన చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికయ్యారని వీసీ పీ నాగభూషణ్ మంగళవారం తెలిపారు. గుంటూరు జిల్లాలోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (వైఎస్ఏఏపీ) నిర్వహించిన 4వ రాష్ట్రస్థాయి యోగాసన చాంపియన్‌షిప్‌లో కే సాయిక్రిష్ణ, చరణ్ గణేష్ రెడ్డి రిథమిక్ పెయిర్ యోగాసన విభాగంలో గోల్డ్ మెడల్ సాధించి నేషనల్ లెవల్ చాంపియన్‌షిప్‌కు ఎంపికయ్యారు. కట్టా రాజ్‌కుమార్, డీ వెంకట సాయి చైతన్య అనే విద్యార్థులు ఆర్టిస్టిక్ యోగాసన పెయిర్ విభాగంలో గోల్డ్ మెడల్ సాధించి నేషనల్ లెవల్ చాంపియన్‌షిప్‌కు ఎంపికయ్యారని తెలిపారు. ఈ.మృనాల్, జి.ఆనంద్ అనే విద్యార్థులు ఆర్టిస్టిక్ యోగాసన పెయిర్ విభాగంలో సిల్వర్ మెడల్ సాధించి నేషనల్ లెవల్ చాంపియన్‌షిప్‌కు మొదటి స్టాండ్‌బై ప్లేయర్లుగా ఎంపికయ్యారు. పతకాలు సాధించి జాతీయ స్థాయి చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను చైర్మన్ లావు రత్తయ్య తదితరులు అభినందించారు.

రాష్ట్ర ప్రభుత్వంలో అన్ని వర్గాలకు ప్రాధాన్యం

ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



11వ వార్డులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలిఅర్బన్: సీఎం వైఎస్ జగన్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు సమప్రాధాన్యం ఇవ్వడంతో పాటు సుపరిపాలన అందిస్తున్నట్లు ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని 11వ వార్డు నాజర్‌పేట-2 సచివాలయంలో మంగళవారం ఉదయం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2019లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజలతో మమేకమవుతూ అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నిత్యం ప్రజల్లో ఉండే విధంగా ప్రభుత్వం అనేక కార్యక్రమాలు ఏర్పాటు చేసి, నిర్వహిస్తుందన్నారు. వాటిలో భాగస్వాములు కావడం ఎంతో తృప్తినిస్తుందన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, 11వ వార్డు కౌన్సిలర్ కఠారి రత్నకుమారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. 11వ వార్డులో ఇప్పటి వరకు రూ.26 కోట్ల సంక్షేమ పథకాలను అందించినట్లు వెల్లడించారు. అనంతరం ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు అవసరం అనే బుక్‌లెట్‌ను, సచివాలయంలో ఏర్పాటు చేసిన లబ్ధిదారుల వివరాల బోర్డులను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ క్లస్టర్-1 అధ్యక్షుడు మద్దాలి శేషాచలం, ప్రోగ్రాం కన్వీనర్ తిరుమలశెట్టి శ్రీనివాసరావు, నాయకులు కఠారి హరీష్, పోతవఝుల పురుషోత్తమ శర్మ, బూరెల దుర్గాప్రసాద్, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

■ వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని 38వ వార్డు రజక చెరువు వద్ద మంగళవారం సాయంత్రం నిర్వహించారు. మున్సిపల్ చైర్ పర్సన్ తాడిబోయిన రాధిక ముఖ్య అతిథిగా పాల్గొని, ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని తెలియజేశారు. వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ వీర్లపాటి విజయలక్ష్మి మాట్లాడుతూ తన వార్డులో రూ.17.34 కోట్ల సంక్షేమాన్ని అందించినట్లు చెప్పారు. బుక్‌లెట్‌ను, లబ్ధిదారుల వివరాలు తెలియజేసే బోర్డులను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ క్లస్టర్-2 అధ్యక్షుడు షేక్ దుబాయ్‌బాబు, మేనేజర్ అప్పలరాజు, సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

పెన్నీ మినిస్ట్రీస్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలు



కేక్ కట్ చేస్తున్న రెవరెండ్ శామ్యూల్



కేక్ కట్ చేస్తున్న సీఐ రామారావు, కిరణ్

తెనాలిరూరల్: బాధితులకు సాయం చేయడంలో ఉన్న సంతృప్తి వెలకట్టలేనిదని పెన్నీ మినిస్ట్రీస్ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు, సినీ దర్శకుడు దిలీప్ రాజా అన్నారు. రూరల్ మండలం పెదరావూరులోని పెన్నీ మినిస్ట్రీస్ కార్యాలయంలో దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల కోసం ప్రత్యేకంగా మంగళవారం సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. లేనివారికి నూతన వస్త్రాలు, భోజనం పెట్టడంలో ఏసుక్రీస్తు చెప్పిన బోధనలు ఉన్నాయన్నారు. ఈ సమావేశానికి నటుడు మిలటరీ ప్రసాద్ అధ్యక్షత వహించారు. సెమీ క్రిస్మస్ వేడుకలకు హాజరయిన దీర్ఘకాలిక వ్యాధి గ్రస్తులకు అంజలి రావూరి నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. అనంతరం అందరికీ ప్రేమ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు అచ్చన శ్రీనివాస్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉత్తరప్రదేశ్ నటుడు అమీర్ ఛోద్రి, రమణయ్య, బాషా, బాబు రావు పాల్గొన్నారు.

ఆర్‌ఎస్ చర్చిలో..

తెనాలిటౌన్: పట్టణంలోని 13వ వార్డు ఆర్.ఎస్ చర్చిలో మంగళవారం రెవరెండ్ పల్లె శామ్యూల్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. క్రిస్మస్ కేక్ కట్ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పాస్టర్ కె.అంబేడ్కర్ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఏసుక్రీస్తు ఈ లోకానికి వెలుగుగా వచ్చి ఉన్నారని, ఆయనను వెంబడించు వారు వెలుగును పొందుతారని తెలిపారు. క్రిస్మస్ ప్రాముఖ్యతను శామ్యూల్ తెలియజేశారు. వేడుకల్లో చైతన్య, రోహి, సుష్మా, ఝాన్సీవాణి, రంగారావు, వెంకటరమణ, సంఘస్థులు పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

తెనాలిఅర్బన్: క్రిస్మస్ పండగ ప్రజలకు సంతోషాన్ని ఇచ్చిందని విజయవాడ బెంజి సర్కిల్ సీఐ యు.రామారావు, వైఎస్సార్ సీపీ నాయకుడు అక్కిదాసు కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. మైకా మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో ఐతానగర్‌లో సోమవారం రాత్రి సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిన్నువలె నీ పొరుగువారిని ప్రేమించమని ఏసుక్రీస్తు చెప్పిన సూక్తిని అందరూ పాటించాలన్నారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో మైకా మినిస్ట్రీస్ అధ్యక్షురాలు పాముల రత్నకుమారి, పాముల రిచర్డ్, సంఘ పెద్దలు సల్మాన్, రూతు, రూజ్‌వెల్ట్, సముయేలు, సునీల్, ప్రసంగి పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించండి



పనులు పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ రాధిక

తెనాలిఅర్బన్: పారిశుద్ధ్య నిర్వహణలో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అన్నారు. పట్టణంలోని 15వ వార్డులో మంగళవారం ఆమె పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి, ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వార్డు పర్యటనలో ప్రజలు తెలియజేసిన సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఆమె వెంట కౌన్సిలర్ గుంటూరు కోటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు తాడిబోయిన రమేష్, గుంటూరు గోపి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆకురాతి రామచంద్రరావు పాల్గొన్నారు.

కేంద్రియ విద్యాలయంలో స్పోర్ట్స్ డే



తెనాలిఅర్బన్: జగ్గడిగుంట పాలెంలోని కేంద్రియ విద్యాలయంలో మంగళవారం స్పోర్ట్స్ డే ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సురేష్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ క్రీడలపై ఆసక్తిని కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పోలీస్ సర్వీస్ సమస్యలను వెంటనే పరిష్కరించాలి



నగరంపాలెం: పల్నాడు, బాపట్ల జిల్లాల నుంచి గుంటూరు జిల్లాకు బదిలీపై వచ్చిన సిబ్బంది సర్వీస్ సమస్యలను ఇరవై రోజుల్లో పరిష్కరించాలని జిల్లా ఏఎస్పీ (పరిపాలన) కె.సుప్రజ ఆదేశించారు. జిల్లాలోని పోలీస్ అధికార, ఆర్మ్‌డ్ రిజర్వ్ సిబ్బందితో మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలోని సమావేశ మందిరంలో పోలీస్ దర్బార్ నిర్వహించారు. ప్రతి ఒక్కరి నుంచి శాఖపరమైన వినతులు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వ్యక్తిగత అర్జీలు, మహిళా పోలీస్ ఇంక్రిమెంట్స్, కుటుంబ సభ్యుల అనారోగ్య సమస్యలు, జిల్లాలోని అధికార సిబ్బంది ఇంక్రిమెంట్స్, పోలీస్ వార్షిక ఇంక్రిమెంట్స్, పిల్లలకు సంబంధించిన మెరిటోరియల్ ఉపకార వేతనాలు తదితర వాటిని పరిష్కరించాలని మినిస్టీరియల్ అధికారులకు ఏఎస్పీ సూచించారు. సిబ్బందికి ఏవైనా డీపీఓకు సంబంధించి సమస్యలు ఉన్నట్లైతే 8688831302 నంబర్‌కు మెసేజ్ పంపిస్తే వెంటనే పరిష్కరిస్తామని ఏఎస్పీ చెప్పారు. కార్యక్రమంలో కంట్రోల్ రూం సీఐ ఏవీ.శివప్రసాద్, ఆర్ఐలు రాఘవయ్య, బ్రహ్మానందం పాల్గొన్నారు.

దళిత హక్కుల ఉద్యమ నేత ఏసురత్నం మృతి



తెనాలి: కొల్లిపరకు చెందిన రాష్ట్ర దళిత ఉద్యమ నేత కనపర్తి ఏసురత్నం (68) మంగళవారం ఆకస్మికంగా మృతి చెందారు. హఠాత్తుగా అనారోగ్యానికి గురైన ఆయనను మంగళగిరిలోని ఓ కార్పొరేట్ ఆసుపత్రిలో చేర్పినా, ప్రయోజనం లేకపోయింది. ఆయనకు భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. బుధవారం స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు. ఉన్నత విద్యను అభ్యసించిన ఏసురత్నం, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు దళిత, గిరిజన, మహిళల హక్కులు, సాంస్కృతిక ఉద్యమాలకు అంకితమయ్యారు. నిబద్ధత, నిజాయితీ, నిరాడంబరతో ఉద్యమంలో కొనసాగుతూ అనేకమంది గ్రామీణ యువతను దళిత ఉద్యమానికి అందించిన మేధావిగా గుర్తింపును పొందారు. జాతి వివక్షపై దక్షిణాఫ్రికాలోని దర్బన్‌లో జరిగిన అంతర్జాతీయ సదస్సుతో సహా పలు జాతీయ, అంతర్జాతీయ సభలు/ సదస్సుల్లో పాల్గొన్నారు. క్రియాశీలక ఉపన్యాసాలు చేశారు. దళిత నేతలు, న్యాయవాదులు కేసీ బసవయ్య, గుమ్మడి రవిరాజు, గరిక వెంకటదుర్గాప్రసాద్, కట్టా గోపి తదితరులు ఏసురత్నం హఠాన్మరణానికి సంతాపం తెలియజేశారు.

అభివృద్ధి పనులు ప్రారంభం



రోడ్డును ప్రారంభిస్తున్న కఠారి హరీష్, ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా వివిధ వార్డుల్లో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పర్యటించినప్పుడు ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులు కార్యరూపం దాల్చుతున్నాయి. సచివాలయం పరిధిలో రూ.20 లక్షల చొప్పున ప్రభుత్వం విడుదల చేసిన నిధులతో ప్రజలు సూచించిన పనులను చకచకా పూర్తిచేస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో పట్టణ 11వ వార్డు పరిధిలో రూ.20 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన రోడ్డు, సీసీ డ్రెయిన్లను మంగళవారం ఎమ్మెల్యే శివకుమార్, ఆ వార్డుకు చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు కఠారి హరీష్ ప్రారంభించారు. శిలాఫలకం ఆవిష్కరించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, వార్డు కౌన్సిలరు కఠారి రత్నకుమారి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ క్లస్టర్-1 అధ్యక్షుడు మద్దాళి శేషాచలం, మాజీ కౌన్సిలరు బి.రాఘవరావు, మున్సిపల్ ఇంజినీరు నాగభూషణం, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఫొటోగ్రఫీ రంగంలో తెనాలి ఖ్యాతిని నిలబెట్టాలి

ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



ఎమ్మెల్యే శివకుమార్‌తో అసోసియేషన్ నూతన కార్యవర్గం

తెనాలి: ఫొటోగ్రఫీ రంగంలో తెనాలి ఖ్యాతిని నవతరం ఇనుమడింపజేయాలని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సూచించారు. ది తెనాలి ఫొటో గ్రాఫర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారోత్సవం మంగళవారం స్థానిక ఎన్జీవో కల్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే శివకుమార్ సమక్షంలో ప్రమాణం చేశారు. ఎమ్మెల్యే గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. నూతన కార్యవర్గం మంచి ప్రణాళికతో ముందుకు వెళ్లాలని నిర్ణయించుకోవటం అభినందనీయమని ఎమ్మెల్యే అన్నారు. ఫొటోగ్రఫీ రంగంలో తెనాలికి ఎంతో పేరుందని గుర్తుచేశారు. ఉత్తమ ఫొటోగ్రాఫర్లు తెనాలి నుంచి ఎందరో వచ్చారని, ఫొటో ఫిల్మ్‌కు కూడా తెనాలి కేంద్రమని చెప్పారు. తెనాలి ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ 20 పర్యాయాలకుపైగా జాతీయస్థాయి ఫొటోగ్రఫీ పోటీలను, ఫొటోగ్రఫీ వర్క్‌షాపులను నిర్వహించినట్లు వివరించారు. రాజన్‌బాబు, ప్రభాకర్ వంటి ప్రసిద్ధ ఫొటోగ్రాఫర్లు ఇందులో పాల్గొనటం తనకు ఇంకా గుర్తుందని చెప్పారు. ఫొటోగ్రఫీ వృత్తిని జీవనోపాధికోసం చేపట్టినా, అందులో చక్కని నైపుణ్యం సాధించాలని సలహానిచ్చారు. అసోసియేషన్‌కు తనవంతు సహకారం ఎప్పటికీ ఉంటుందని హామీనిచ్చారు. అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా మేడపల్లి ప్రభాకర్, గౌరవ అధ్యక్షులుగా ఐ.కోటేశ్వరరావు, వి.శ్రీకాంత్, ఉపాధ్యక్షుడిగా చిరంజీవి, కార్యదర్శిగా సీహెచ్ రఘు, సంయుక్త కార్యదర్శిగా ఎస్.గిరీష్, కోశాధికారిగా కె.రవిశంకర్, కార్యవర్గ సభ్యులుగా వినోద్, వసంత్, శివప్రసాద్, రమేష్, నాని, వేణుగోపాల్, క్రాంతి, రఘు, విజయ్, శ్రీకాంత్ ప్రమాణ స్వీకారం చేశారు. సంఘ పాలకవర్గం సమష్టిగా వ్యవహరిస్తుందని అసోసియేషన్ బాధ్యతలను చక్కగా నెరవేరుస్తామని అధ్యక్షుడు మేడపల్లి ప్రభాకర్ వెల్లడించారు. అనంతరం ఎమ్మెల్యే శివకుమార్‌ను నూతన పాలకవర్గం సత్కరించింది.

విద్యార్థులు ఇష్టంగా కష్టపడి చదవాలి



లంచ్ బాక్స్‌లు అందజేస్తున్న గిరిబాబు, పూర్వ విద్యార్థులు

తెనాలిటౌన్: విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఇష్టంగా కష్టపడి చదవాలని బీఎస్ఎన్ఎల్ డివిజనల్ మేనేజర్ గిరిబాబు పేర్కొన్నారు. పట్టణంలోని మారీసుపేట చెంచు రామానాయుడు మున్సిపల్ ఉన్నత పాఠశాలలో మంగళవారం 1979-80 సంవత్సరం 10వ తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. పూర్వ విద్యార్థి టి.ఎస్.ఎస్.ప్రసాద్ పర్యవేక్షణలో జరిగిన సభకు పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం బషీర్ అహ్మద్ అధ్యక్షత వహించారు. సబ్ డివిజనల్ మేనేజర్ మదన్ మోహనరావు, పూర్వవిద్యార్థి ప్రసాద్, ఉపాధ్యాయులు మాట్లాడారు. ఈ సందర్భంగా పాఠశాలలోని విద్యార్థులకు వాటర్ బాటిల్స్, లంచ్ బాక్స్‌లను పంపిణీ చేశారు. ప్రతి ఏడాది పాఠశాలలో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు పూర్వ విద్యార్థులు తెలిపారు. పూర్వ విద్యార్థులు మహ్మద్ షరీఫ్, రమణబాబు, శ్రీనివాసరెడ్డి, పోలేరమ్మ, నూర్జహన్, హనుమంతరావు, శ్రీదేవి, భూలక్ష్మి పాల్గొన్నారు.

అంతర్ కళాశాలల క్విజ్ పోటీలు



క్విజ్ పోటీల విజేతలతో ప్రిన్సిపల్ మోజెస్, పూర్వ విద్యార్థులు

గుంటూరు ఎడ్యుకేషన్: స్థానిక ఆంధ్ర క్రైస్తవ (ఏసీ) కళాశాలలో పూర్వ విద్యార్థుల సంఘ ఆధ్వర్యంలో అంతర్ కళాశాలల క్విజ్ పోటీలు మంగళవారం నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్ మోస్ట్ రెవరెండ్ కేఎఫ్ పరదేశిబాబు, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.మోజెస్ పర్యవేక్షణలో పోటీలు నిర్వహించారు. పూర్వ విద్యార్థి, ఆదాయపు పన్ను శాఖ విశ్రాంత కమిషనర్ మేకతోటి దయాసాగర్ తన తల్లిదండ్రులు, సోదరుని జ్ఞాపకార్థం అందజేసిన రూ.30 వేలతో ప్రథమ, ద్వితీయ బహుమతులు అందజేశారు. ప్రథమ స్థానంలో ప్రభుత్వ మహిళా కళాశాల రూ.20 వేలు, ఏసీ కళాశాల విద్యార్థులు ద్వితీయ బహుమతి కింద రూ.10 వేలు అందుకున్నారు. బెన్నిసన్ స్పాన్సర్ చేసిన రూ.ఐదు వేలను తృతీయ బహుమతి రూపంలో ఏసీ కళాశాల పీజీ విద్యార్థులు గెలుపొందారు. డీఎస్పీ ఐజక్ ప్రభాకర్ స్పాన్సర్ చేసిన రూ.రెండువేల కన్సొలేషన్ బహుమతులను జేకేసీ కళాశాల విద్యార్థులు గెలుచుకున్నారు. ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.మోజెస్ మాట్లాడుతూ విద్యార్థులు నిరంతరం కష్టపడి చదివి, పోటీ పరీక్షల్లో నెగ్గి ప్రజాసేవలో మెరుగైన సేవలు అందించాలని సూచించారు. అనంతరం విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల పూర్వ విద్యార్థి సంఘ కార్యదర్శి డాక్టర్ ఎజ్రా విజయ్‌శేఖర్, డాక్టర్ మైఖేల్ వినయ తేజ, డాక్టర్ పీబీ శరా, డాక్టర్ దయానా సత్యలత, ప్రభాకర్, రాజశేఖర్, శాంతి ప్రియ రంజని, డాక్టర్ ప్రశాంతి పాల్గొన్నారు.

26 నాటికి పెండింగ్ అర్జీలు పూర్తి



మాట్లాడుతున్న అదనపు కమిషనర్ లక్ష్మీ శివజ్యోతి

నెహ్రూనగర్: ఎన్నికల కమిషన్ జనవరి 5న ఓటర్ల తుది జాబితా విడుదల చేయనున్న నేపథ్యంలో పెండింగ్ అర్జీలు ఈ నెల 26వ తేదీ నాటికి పూర్తి చేస్తామని నగర పాలక సంస్థ అదనపు కమిషనర్, పశ్చిమ నియోజకవర్గ ఈఆర్వో కె.లక్ష్మీ శివజ్యోతి తెలిపారు. కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశాల మేరకు మంగళవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో అదనపు కమిషనర్ ఎన్నికల సంఘం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు ఓటర్ల తుది జాబితా వచ్చే నెల 5న వస్తుందని, ఇప్పటి వరకు డ్రాఫ్ట్ రోల్‌పై అందిన ఫిర్యాదులు, అర్జీలను ఈ నెల 26 నాటికీ పూర్తి చేసేలా కార్యాచరణ సిద్ధం చేశామన్నారు. అర్జీలు పెండింగ్ ఉన్న బీఎల్‌ఓల వారిగా సమీక్షించి ప్రత్యేక శ్రద్ధతో పూర్తి చేసేలా చూడాలని సూపర్వైజరీ అధికారులను ఆదేశించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు సమావేశాల్లో అందించిన ఫిర్యాదులు, అర్జీలను క్రమ పద్ధతిలో రికార్డ్ చేసి, క్షేత్ర స్థాయిలో బీఎల్‌ఓలు పరిశీలించి, తగు చర్యలు తీసుకుంటారన్నారు. సమావేశంలో ఏఈఆర్‌ఓ బి.శ్రీనివాసరావు, మేనేజర్ శివన్నారాయణ, సూపరింటెండెంట్లు సాంబశివరావు, ప్రసాద్, పద్మ, టీడీపీ నుంచి ఓంకార్, బీఎస్పీ నుంచి సీహెచ్ వాసు, బీజేపీ నుంచి ఆర్.భాస్కరరావు, వైఎస్సార్ సీపీ నుంచి జానీ బాషా, ఆమ్ ఆద్మీ నుంచి సేవకుమార్, సీపీఎం నుంచి షేక్ ఖాసిం పాల్గొన్నారు.

వికసిత్ భారత్ సంకల్ప యాత్ర



పెదపాలెంలో నిర్వహించిన యాత్రలో పాల్గొన్న వైద్యులు, వివిధ శాఖల అధికారులు

తాడేపల్లిరూరల్: ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రారంభించిన వికసిత్ భారత్ సంకల్ప యాత్రను మంగళవారం దుగ్గిరాల మండలం పెదపాలెం, వీర్లపాలెం గ్రామాల్లో నిర్వహించారు. పెదపాలెం గ్రామంలో నిర్వహించిన ఈ యాత్రకు సర్పంచ్ పాటిబండ్ల కృష్ణప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు పుతుంబాక సత్యసాయి కృష్ణలు ముఖ్య అతిథులుగా విచ్చేసి ప్రధానమంత్రి మాతృత్వ యోజన కార్యక్రమం ఉపయోగాలను, ఆయుష్మాన్ భారత్ కార్డు ఉపయోగాలను ప్రజలు వివరించారు. అనంతరం ఉజ్వల పథకం ద్వారా గ్యాస్ కనెక్షన్ పొందిన వారికి గ్యాస్ సిలెండర్, రెగ్యులేటర్, పత్రాలను అందజేశారు. మండల వ్యవసాయ అధికారి డ్రోన్ ద్వారా క్రిమిసంహార మందులు ఏవిధంగా ఉపయోగించుకోవాలో వివరించారు. హెల్త్ డిపార్ట్‌మెంట్ వారిచే ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి, మందులు ఉచితంగా అందజేశారు. వీర్లపాలెంలో జరిగిన కార్యక్రమానికి సర్పంచ్ బి.శ్రీనివాసరెడ్డి అధ్యక్షత వహించగా, ఏపీఎం మహాలక్ష్మి ముఖ్య అతిథిగా విచ్చేశారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు స్వయం సహాయ సంఘాల వారికి ఏవిధంగా ఉపయోగపడుతున్నాయో వివరించారు. ఆయుష్మాన్ కార్డును ఎలా పొందాలో వివరించారు. ప్రధాన మంత్రి మాతృత్వ యోజన పథకం ద్వారా లబ్ధి పొందిన వారితో వారి అనుభవాలను అందరికీ వివరించారు. ఆయుష్మాన్ కార్డు ప్రయోజనాలను వివరించారు. అనంతరం బాలికలతో నృత్యాలు, కోలాటం కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి శిరీష, మెడికల్ ఆఫీసర్ దుర్గాప్రసాద్, ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ వైద్యులు డాక్టర్ హాసిని, క్షయ వ్యాధి నివారణ సూపర్‌వైజర్ రవి, రెండు గ్రామాల డ్వాక్రా యానిమేటర్లు, విలేజ్ ఆర్గనైజేషన్ ప్రెసిడెంట్లు, డ్వాక్రా మహిళలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, రైతులు పాల్గొన్నారు.

హిందూ కళాశాలలో బోటనీ క్వెస్ట్

గుంటూరు ఎడ్యుకేషన్: మార్కెట్ సెంటర్లోని హిందూ కళాశాలలో బోటనీ విభాగ ఆధ్వర్యంలో మంగళవారం డాక్టర్ టీఎస్ రామారావు స్మారక జిల్లా స్థాయి అంతర్ కళాశాలల ఇంటర్, డిగ్రీ వృక్షశాస్త్ర విద్యార్థులకు బోటనీ క్వెస్ట్ పేరుతో వివిధ పోటీలను నిర్వహించారు. ఈసందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రభుత్వ వైద్య కళాశాల విశ్రాంత ప్రొఫెసర్ ఏవీ దక్షిణామూర్తి విద్యార్థులకు వృక్ష శాస్త్ర పరిజ్ఞానాన్ని ఏ విధంగా పెంపొందించుకోవాలనే విషయమై అవగాహన కల్పించారు. విశిష్ట అతిథులుగా పాల్గొన్న సీవీకేఆర్ రామారావు, డాక్టర్ ఏ రామారావు, కళాశాల అకడమిక్ అడ్వైజర్ డాక్టర్ కె.కాళిదాస్, ఐక్యూఏసీ సమన్వయకర్త డాక్టర్ పి.వేణుగోపాల్, డాక్టర్ టీఎస్ రామారావుతో తమకు గల అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ ఆయన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులకు పోస్టర్ ప్రజెంటేషన్, క్విజ్, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. నగరంలోని వివిధ కళాశాలల నుంచి 150 మందికి పైగా విద్యార్థులు పోటీ పడ్డారు. డిజిటల్ పోస్టర్ ప్రజెంటేషన్‌లో మాతృశ్రీ, విజ్ఞాన్, జేకేసీ కళాశాల, వక్తృత్వంలో ప్రభుత్వ మహిళా కళాశాల, బీహెచ్, జేఎంజే కళాశాల వరుసగా మొదటి మూడు స్థానాలతో పాటు క్విజ్‌లో విజ్ఞాన్ కళాశాల, ప్రభుత్వ మహిళా కళాశాల ద్వితీయ, తృతీయ బహుమతులు పొందారు. విజేతలకు నగదు బహుమతి, జ్ఞాపిక, ప్రశంసా పత్రం అందజేశారు.